ఓటెత్తిన చైతన్యం

ఐదేళ్లకోసారి వచ్చే ఓట్ల పండగకు ఓటర్లు పోటెత్తారు. సామాజిక మాధ్యమాల పుణ్యమా అని పెరిగిన చైతన్యంతో యువత అధిక సంఖ్యలో తరలివచ్చి, ఓటేశారు. ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారుకూడా సొంత ప్రాంతాలకు రావడంతో పోలింగ్ కేంద్రాలు కిటకిటలాడాయి. సోమవారం ఉదయం 7 గంటలకు ముందు నుంచే కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. మండే ఎండను సైతం లెక్క చేయకుండా క్యూలైన్లలో నిరీక్షించారు. వృద్ధులు, మహిళలు ఉత్సాహంగా తరలివచ్చి ఓట్లేశారు. ఓటు అనే ఆయుధంతో తమ తీర్పును ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు.

- ప్రశాంతంగా పోలింగ్
- ఉదయం కొన్నిచోట్ల ఈవీఎంల మొరాయింపు
- దీంతో మందకొడిగా పోలింగ్ ప్రారంభం
- రాత్రి 10 గంటల వరకు 64.93శాతం నమోదు
- మరింత పెరిగే అవకాశం

పోలింగ్ శాతం ఇలా..

సమయం	శాతం
ఉదయం 7 నుంచి 9 గంటల మధ్య	17.23
ఉదయం 9 నుంచి 11 గంటల మధ్య	21.65
ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు	38.02
మధ్యాహ్నం 1 గంట నుంచి 3 వరకు	45.85
మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు	58.23
సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు	64.93


గుడివాడ అప్పన్నకాలనీ ఎంపీపీ స్కూల్లో సాయంత్రం 5 గంటలకు ఓటు వేసేందుకు కిక్కిరిసిన జనం


ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తున్న పోలింగ్ సిబ్బంది


అగనంపూడి దొంకాడ స్కూల్‌లో కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకొంటున్న ఓటర్లు

గాజువాక : గాజువాకలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన పోలింగ్‌కు ఓటర్లు పోటెత్తారు. సోమవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి రాత్రి వరకు ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరారు. వివిధ పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలలో అవాంతరాలు తలెత్తగా అధికారులు వెంటనే సరిచేసి పోలింగ్‌ను కొనసాగించారు. నియోజకవర్గంలోని 306 పోలింగ్ కేంద్రాల్లో తొలుత పోలింగ్ మందకొడిగా ప్రారంభమైనా తర్వాత ఒక్కసారిగా జోరందుకుంది. ఉదయం ఆరు గంటల నుంచే పోలింగ్ కేంద్రాలవద్ద ఓటర్లు బారులు తీరి ఉన్నారు. ఎలక్షన్ కమిషన్ ఉత్తర్వుల మేరకు ఉదయం ఐదున్నర గంటలకే మాక్ పోలింగ్‌ను పూర్తి చేశారు. ఎండను దృష్టిలో ఉంచుకొని అని పోలింగ్ కేంద్రాలవద్ద నీడ కోసం టెంట్‌లను ఏర్పాటు చేశారు. తాగునీరు, టాయిలెట్లు, వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.

ప్రస్తుతం నియోజకవర్గంలో 3,30,611 మంది ఓటర్లున్నారు. వారిలో 2,14,665 మంది ఓటింగ్‌లో పాల్గొన్నట్టు అధికారులు తెలిపారు. ఇది రాత్రి 10గంటల వరకు అందిన సమాచారం. ఓటింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది. ఉదయం 7 నుంచి తొమ్మి ది గంటల వరకు 17.23 శాతం, 11 గంటలకు 21.65 శాతం, ఒంటి గంటకు 38.02 శాతం, మూడు గంటలకు 45.85 శాతం నమోదు కాగా, సాయంత్రం ఐదు గంటలకు 58.23 శాతం నమోదైంది. రాత్రి 10 గంటల సమయానికి సుమారు 64.93 శాతం నమోదైనట్లు రిటర్నింగ్ అధికారి లక్ష్మారెడ్డి తెలిపారు. గత ఎన్నికలకంటే ఈసారి పోలింగ్ శాతం పెరిగినట్టు పేర్కొన్నారు. గాజువాకలో పలువురు ప్రముఖులు తమ కుటుంబ సభ్యులతో సహా ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మింది స్కూల్‌లో, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కొత్త గాజువాక ప్రాథమిక పాఠశాలలో, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి వికాస్‌నగర్‌లో ఓటు వేశారు.


ఉక్కునగరం విమల విద్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులతో అమర్‌నాథ్

పెదగంట్యాడలో ..

పెదగంట్యాడ: ఓటర్లు పోటెత్తారు. మండలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున ఓటేశారు. ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారరంభం కాగా 9 గంటల సమయానికి మండలంలో 10శాతానికి పైగా ఓట్లు నమోదయ్యాయి. మధ్యాహ్నం 12 గంటల సమయానికి 27 శాతం, మధ్యాహ్నం ఒంటిగంటకు 33 శాతం మంది ఓట్లు వేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓటర్ల సంఖ్య ఒక్కసారిగా పెరిగిపోయింది. సాయంత్రం 6 గంటలు దాటినా బూత్‌ల వద్ద జనం బారులు తీరే ఉన్నారు. దీంతో మండలంలో సాయంత్రం 6.30 గంటల సమయానికి సుమారు 62శాతం వరకు ఓటింగ్ నమోదైంది.

ఓటర్లతో కిటకిటలాడిన పోలింగ్ బూత్‌లు: మండలంలోని యారాడ, గంగవరం, గొడ్డువానిపాలెం, వెంకన్నపాలెం, నెల్లిముక్కు, దల్లివానిపాలెం, సిద్దేశ్వరం, సీతానగరం, నడుపూరు, పెదగంట్యాడ, దిబ్బపాలెం తదితర ప్రాంతాల్లోని పోలింగ్ బూత్‌లు ఉదయం నుంచి రాత్రి వరకూ ఓటర్లతో కిటకిటలాడాయి. వృద్ధులు, దివ్యాంగులు సైతం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు తాగునీరు, మందులు అందుబాటులో ఉంచారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా వీల్‌చైర్లు ఏర్పాటు చేశారు.

యారాడ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన సీపీ

యారాడలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ పోలింగ్ కేంద్రాన్ని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. గాజువాక నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ కూడా యారాడలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించి, ఓటింగ్ సరళిపై ఆరా తీశారు.

68వ వార్డులో..

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్, ఎంపీపీ స్కూల్, మింది జెడ్పీ హైస్కూల్, ఎంపీపీ స్కూళ్లలో ఓటర్లు ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్ర మంత్రి, గాజువాక నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ భార్య హిమగౌరి, సోదరి సురేఖ, తల్లి గుడివాడ నాగమణి, పెదనాన్న, వైఎస్సార్ సీపీ సీఈసీ మెంబర్ గుడివాడ అప్పలరామ్మూర్తి, కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, బంధువులతో కలిసి మింది జెడ్పీ హైస్కూల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం అమర్‌నాథ్ వార్డు పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి, పోలింగ్ సరళి పరిశీలించారు.

69వ వార్డులో.. : నాతయ్యపాలెం ఎంపీపీ స్కూల్, తుంగ్లాం, చుక్కవానిపాలెం, కాపుతుంగ్లాంలోని ఎంపీపీ పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా సాగాయి. ఎస్టీబీఎల్ అధినేత గుత్తికొండ బాలాజీ తమ ఓటు హక్కును ఫకీర్‌తక్యాలో వినియోగించుకున్నారు. మింది జెడ్పీ హైస్కూల్ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఏసీపీ త్రినాథ్, ట్రాఫిక్ డీసీపీ డి.శ్రీనివాసులు పర్యవేక్షించారు.


వెంకన్నపాలెంలో రాత్రి 8 గంటల సమయంలో ఓటు వేసేందుకు క్యూలో నిరీక్షిస్తున్న ఓటర్లు


సహాయకులతో డ్రైవర్స్ కాలనీలోని పోలింగ్ కేంద్రానికి వచ్చిన వృద్ధుడు


ఓటు వేసేందుకు వృద్ధురాలిని మోసుకు వస్తున్న ఆమె మనవడు

గుడివాడ అప్పన్న కాలనీలో..

68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీ ఎంపీపీ స్కూల్‌లోని పోలింగ్ బూత్ నంబర్ 169, 170,171లలో సాయంత్రం 5 గంటల సమయంలోనూ ఓటర్లు బారులు తీరారు.

ఉక్కునగరంలో 54.35 శాతం

ఉక్కునగరం: ఉక్కునగరంలో పోలింగ్ ఉదయం మందకొడిగా ప్రారంభమైనా 9 గంటలకు ఊపందుకుంది. 10.30 గంటలకు సుమారు 20 శాతంగా ఉన్న పోలింగ్ మధ్యాహ్నానికి పుంజుకుంది. ఉదయం కొన్ని కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించినా అధికారులు సకాలంలో చర్యలు తీసుకోవడంతో అవి ప్రారంభమయ్యాయి. ఉద్యోగులు మధ్యాహ్నం సమయంలో ఎండను కూడా లెక్క చేయకుండా బారులు తీరి ఓటింగ్‌లో పాల్గొన్నారు. డీఏవీ పాఠశాలలో రెండు బూత్‌లు, కేంద్రీయ విద్యాలయంలో రెండు బూత్‌లలో, విశాఖ విమల విద్యాలయంలోని ఐదు కేంద్రాల్లో ఉక్కునగరవాసులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం తొమిది కేంద్రాల్లో 7755 మంది ఓటర్లు ఉండగా సాయంత్రానికి 54.35 శాతంతో 4215 ఓట్లు పోల్ అయ్యాయి. మధ్యాహ్నం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు మంత్రి రాజశేఖర్, వార్డు నాయకులు రావాడ శివ, సాపే బ్రహ్మయ్య, వై.మస్తానప్ప, టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు, సీపీఎం అభ్యర్థి ఎం.జగ్గునాయుడు అన్ని కేంద్రాలు తిరిగి పోలింగ్ సరళి పర్యవేక్షించారు. స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.


గంగవరంలో ఓటు వేసేందుకు క్యూ కట్టిన ఓటర్లు


కణితి హైస్కూల్‌వద్ద ఓటు వేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు


గాజువాక హైస్కూల్‌లో బారులు తీరిన ఓటర్లు


గాజువాక హైస్కూల్‌లో ఓటు వేయదానికి వస్తున్న వృద్ధురాలు


యారాడలో వృద్ధురాలిని పోలింగ్ బూత్‌లోకి తీసుకెళ్తున్న కానిస్టేబుల్


డ్రైవర్స్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఓటు వేసిన వృద్ధురాలు


మింది హైస్కూల్‌లో ఓటు వేసి సిరా గుర్తు చూపుతున్న వృద్ధుడు


యారాడలో ఓటు వేసిన నార్త్ ఇండియన్స్


ఓటు హక్కు వినియోగించుకున్న ఎస్టీబీఎల్ బాలాజీ


గాజువాక ప్రాథమిక పాఠశాలలో ఓటు వేయడానికి బారులుదీరిన ఓటర్లు


కూర్మన్నపాలెం ప్రాథమిక పాఠశాలలో బారులు తీరిన ఓటర్లు


గొడ్డువానిపాలెంలో బారులు తీరిన ఓటర్లు


యారాడ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన సీపీ డాక్టర్ రవిశంకర్


గాజువాక ప్రాథమిక పాఠశాలలో ఓటు వేసిన టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు దంపతులు


మింది జెడ్పీ హైస్కూల్లో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు


వీల్‌చైర్‌లో వృద్ధురాలిని తీసుకెళ్తున్న పోలీసులు


మింది జెడ్పీ హైస్కూల్ వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న ఏసీపీ త్రినాథ్


అగనంపూడి దొంకాడ స్కూల్‌లో ఏర్పాటు చేసిన యూత్ పోలింగ్ బూత్‌లో బారులు తీరిన ఓటర్లు


ప్రభుత్వ న్యూ ఐటీఐలో ఓటర్ల క్యూలైన్


76వ వార్డు నడుపూరు కమ్యూనిటీ హాల్ వద్ద బారులు తీరిన ఓటర్లు

సింహగిరిపై ఆర్జిత సేవల పునరుద్ధరణ


జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం ఆర్జిత సేవలను పునరుద్ధరించారు. ఈ నెల 10న స్వామివారి చందనోత్సవం 8వ తేదీ నుంచి 12 వరకు ఆర్జిత సేవలన్నీ రద్దు చేశారు. తిరిగి సోమవారం ఆర్జిత సేవలను పునరుద్ధరించారు. దీనిలో భాగంగా ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలబ్రాలు ఘట్టాలలో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

నవతరం కదిలింది

తొలిసారి ఓటు వేసి మురిసిన యువత

పెదగంట్యాడ/అక్కిరెడ్డిపాలెం: నియోజకవర్గంలో పలువురు యువతీ యువకులు మొదటిసారి తొలిఓటు వేశారు. తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకున్న యువతలో కొత్త ఉత్సాహం కనిపించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో సమర్థులైన పాలకులను ఎన్నుకునేందుకు భారత పౌరులుగా ఈ హక్కును వినియోగించుకోవడం ఆనందాన్నిచ్చిందని కొందరు, మరపురాని అనుభూతినిచ్చిందని మరికొందరు తెలిపారు.


తొలి ఓటు వేసిన వి.మౌనిక, బి.లిఖిత, డి.పుష్పలత

ఎక్సైటింగ్‌గా అనిపించింది



నేను తొలిసారి ఓటు వేశాను. చాలా ఎక్సైటింగ్‌గా అనిపించింది. గతంలో అమ్మా నాన్నలు ఓటు వేయడానికి వెళ్తున్నప్పుడు వారితో కలిసి వెళ్లేదాన్ని. కానీ పోలింగ్ బూత్‌లోకి రానిచ్చేవారు కాదు, బయటే వెయిట్ చేయాల్సి వచ్చేది. ఇప్పుడు నా ఓటర్ ఐడీ చూపించి, లోపలికి వెళ్తుంటే చాలా ఆనందంగా అనిపించింది. ఈ అనుభూతిని జీవితంలో మర్చిపోలేను.

– బంక సారిక, యారాడ

చాలా ఆనందంగా ఉంది



మేము మొట్టమొదటి సారి ఓటు హక్కును వినియోగించుకున్నాం. ఓటు వేస్తుంటే చాలా ఆనందంగా అనిపించింది. సమర్థులైన నాయకులను ఎన్నుకోవడం వల్ల సమాజానికి దేశానికి ఎంతో మేలు జరుగుతుంది. రాజ్యాంగం కల్పించిన హక్కును సక్రమంగా వినియోగించుకున్నాం. మంచి పాలకులకు ఓటు వేశాం.

– శరణ్య, రమాదేవి, భెల్ టౌన్‌షిప్

రామాలయంలో విశేషంగా హోమం

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో సోమవారం విశేషంగా హోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణమండపంలో స్వామివారి సీతారాముల ఉత్సవమూర్తులను వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు ప్రసాదం అందజేశారు. అలాగే సంక్షిప్త రామాయణ పారాయణ నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సతీసమేతంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ ఆధ్వర్యంలో అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు.


ప్రధాన కలశాన్ని శిరస్సుపై పెట్టుకుని ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు

మొరాయించిన ఈవీఎంలు

గాజువాక : గాజువాక నియోజకవర్గంలో పలుచోట్ల ఈవీఎంలు మొరాయించాయి. దీంతో అక్కడక్కడా తప్ప నియోజకవర్గంలో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. వీలైనంత త్వరగా ఓటు వేద్దామని పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లలో ఎండ తీవ్రత కారణంగా కొంతమంది వెనుదిరిగారు. మళ్లీ సాయంత్రం ఎండ తగ్గిన తరువాత పోలింగ్ కేంద్రాలకు రావడంతో పలు ప్రాంతాల్లో పోలింగ్ ఆలస్యంగా ముగిసింది.

- గాజువాక జెడ్పీ హైస్కూల్‌లోని పోలింగ్ బూత్ 183లో ఓటింగ్ ప్రారంభమైన గంటన్నర తరువాత ఈవీఎం మొరాయించింది. 40 మంది ఓట్లు వేశాక ఈవీఎంను మార్చాలంటూ మెసేజ్ రావడంతో అధికారులు తొలుత గందరగోళానికి గురయ్యారు. సాంకేతిక సిబ్బంది సాయంతో ఈవీఎంను మార్చి ఓటింగ్‌ను కొనసాగించారు.
- చినగంట్యాడ ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ బూత్ నంబర్ 108లో ఓటింగ్ 15 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది.
- సాయంత్రం కురిసిన వర్షం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అధికారులు ఓటింగ్ కొనసాగించడానికి ఇబ్బంది పడ్డారు. గుడివాడ అప్పన్న కాలనీ, భరత్‌నగర్, నడుపూరు కేంద్రాల్లో రాత్రి పది వరకు ఓటింగ్ కొనసాగింది.
- ఫకీర్‌తక్యా బూత్ నంబర్ 132లోని ఈవీఎంలో సాంకేతిలోపం చోటు చేసుకుంది. దీంతో ఓటర్లు ఎండలోనే గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖవాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ. 1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.